సాక్షి
విజయనగరం
ఆదివారం । 12 । ఫిబ్రవరి । 2023



ఉత్సాహం ఉరకలు.. జోరుగా పరుగులు

'సాక్షి'ప్రీమియర్ లీగ్(ఎస్పీఎల్) క్రికెట్ ప్రాంతీయ స్థాయి పోటీలు శనివారం ఏయూ గోల్డెన్ జూబ్లీ మైదానంలో ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి.

- 8లో



ప్రభుత్వంపై తప్పుడు కథనాలు తగవు

రాష్ట్ర ప్రజానీకానికి నిత్యం మంచి చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, నేతలపై టీడీపీ నాయకులు ఆరోపణలు చేయడం, ఎల్లోమీడియాలో తప్పుడు కథనాలు ప్రచురించడంపై ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య మండిపడ్డారు.

- 8లో



ఏప్రిల్ 5న చలో ఢిల్లీ

ఏప్రిల్ 5వ తేదీన చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ, ఏపీ(ఆంధ్రప్రదేశ్) రైతు, కౌలురైతు, వ్యవసాయ, కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి.

- 8లో

న్యూస్‌రీల్

యథావిధిగా స్పందన

విజయనగరం: ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా నిర్వహించే స్పందన కార్యక్రమం వచ్చే సోమవారం యథావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ సూర్యకుమారి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో ప్రజల నుంచి వినుతులు స్వీకరిస్తామని, జిల్లా అధికారులందరూ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

ఖజానా శాఖ అధికారి మృతి



గణేష్

విజయనగరం: జిల్లా ఖజానా అధికారి ఎస్.ఆర్.కె.గణేష్ మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శనివారం తెల్లవారుజామున విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. కలెక్టర్ ఎ.సూర్యకుమారి, ఖజానా శాఖ డీఈ ఆర్ ఏస్ కుమార్, ఏటీఓలు నితిన్‌జోషి, ఆదిత్యసింగ్, ఉద్యోగులు పద్మనాభం, ఆదినారాయణ, రామరాజు, సుధాకర్ సంతాపం తెలిపారు.

పక్కాగా ఎన్నికల నియమావళి అమలు

- కలెక్టర్ సూర్యకుమారి



విజయనగరం అర్బన్: జిల్లాలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలు సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలుచేయాలని, అన్ని రాజకీయ పార్టీలను సమదృష్టితో చూడాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి తహసీల్దార్లు, ఎంపీడీఓలను ఆదేశించారు. జిల్లాలోని ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో కలెక్టర్ శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గతంలో మంజూరైన పథకాలు, పనులు కొనసాగించేందుకు అభ్యంతరం లేదన్నారు. పట్టభద్రుల నియోజకవర్గంలో అర్హులైన ఓటర్లందరికీ వారు ఏ పోలింగ్ కేంద్రాల్లో తమ ఓటుహక్కు వినియోగించుకోవాలి, ఓటు వేసేందుకు ఎలాంటి గుర్తింపు కార్డులు తీసుకురావాలన్న అంశంపై అవగాహన కల్పించాలన్నారు. ప్రవర్తన నియమావళి అమలుకు సహాయ రిటర్నింగ్ అధికారులు బాధ్యత వహించాలన్నారు. తహసీల్దార్ల వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై తగిన విచారణ జరిపి ఆయా దరఖాస్తుదారుల అర్హత మేరకు వాటిని పరిష్కరించాలని సూచించారు. జిల్లాలోని ఎంపీడీఓలకు ఎన్నికల ప్రవర్తన నియమావళిపై అవగాహన కల్పించాలని జెడ్పీ సీఈఓ అశోక్‌కుమార్‌కు సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఆర్డీఓలు శేషశైలజ, అప్పారావు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు



బందోబస్తుపై ఎస్‌ఐ నారాయణరావుకు సూచనలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నెల్లిమర్ల రూరల్: రామతీర్థంలో ఈ నెల 18 నుంచి జరగనున్న శివరాత్రి ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఉత్సవాల బందోబస్తు నేపథ్యంలో రామతీర్థం దేవస్థానాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివరాత్రి ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఎస్సై నారాయణరావుకు పలు సూచనలు ఇచ్చారు.

శ్రీకాకుళం నుంచి 30 బస్సులు

రామతీర్థంలో జరగబోయే శివరాత్రి ఉత్సవాలకు శ్రీకాకుళం జిల్లా నుంచి 30 బస్సులతో ప్రయాణ సేవలందిస్తామని ఆ జిల్లా ఆర్టీసీ డిపో మేనేజర్ మాధవ్ తెలిపారు. రామతీర్థం దేవాలయాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం నుంచి వయా రణస్థలం మీదుగా రామతీర్థం దేవస్థానికి రెండు రోజుల పాటు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతామని చెప్పారు. కార్యక్రమంలో ఈఓ ప్రసాదరావు పాల్గొన్నారు.

చివరి వరకూ కొనుగోలు

- రైతుల వద్ద అమ్మకానికి ఉన్న ధాన్యం అంతా సేకరణ
- గత ప్రభుత్వాలకు భిన్నంగా వైఎస్సార్‌సీపీ సర్కారు అండ
- ప్రైవేట్ మార్కెట్ కన్నా అధిక ధర, సకాలంలో చెల్లింపులు
- ఇరు జిల్లాల్లో ఇప్పటివరకూ రూ.922 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు
- 1,20,678 మంది రైతులకు మేలు
- నాలుగేళ్లలో మూడురెట్లు పెరిగిన లబ్ధిదారులు



విజయనగరం మండలం రాకోడులో ధాన్యం నాణ్యతను పరిశీలిస్తున్న ఆర్‌బీకే సిబ్బంది

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

ఉమ్మడి విజయనగరం జిల్లా వైపు గత ప్రభుత్వాల కాలంలో కనిపించే కరువు నాలుగేళ్లుగా కన్నెత్తికూడా చూడలేదు. వరుణుడి కరుణ, కాలం అనుకూలత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ సర్కారు సమయానుకూలంగా అందిస్తున్న సహకారం వెరసి వరి రైతుల పంట పండింది. అనూహ్యంగా రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడి పెరిగింది. జిల్లాలో ఎక్కడ చూసినా ధాన్యపు రాశులే!. గతంలో పండిన కొద్ది ధాన్యాన్నీ రైతులు గిట్టుబాటు ధర రాకపోయినా దళారులకే ఎంతోకొంత ధరకు అమ్ముకోవాల్సి వచ్చేది. గత నాలుగేళ్లుగా ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది. ప్రైవేట్ మార్కెట్ వ్యాపారులు, దళారులు చెబుతున్న ధర కన్నా ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న ధరే అధికంగా ఉంటోంది. అంతేకాదు వైఎస్సార్ రైతుభరోసా కేంద్రాల ద్వారా కళ్లాల వద్దే కొనుగోలు, రైతులు నేరుగా రైస్ మిల్లులకు తరలిస్తే రవాణా చార్జీలు, సకాలంలో చెల్లింపులతో రైతులు తమ వద్దనున్న ధాన్యాన్ని సర్కారుకు విక్రయించడానికే మొగ్గుచూపిస్తున్నారు. అటు ప్రభుత్వం కూడా వారికి అండగా నిలుస్తోంది. వారి వద్ద అమ్మకానికి ఉన్న ప్రతి గింజనూ కొనుగోలు చేయాలని జిల్లా అధికార యంత్రాంగానికి ఆదేశాలు ఇచ్చింది.

ఉమ్మడి విజయనగరం జిల్లాలో 2019–20 ఖరీఫ్‌లో 4,21,455 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించింది. తర్వాత 2020–21 ఖరీఫ్‌లో 4,43,941 మెట్రిక్ టన్నులకు పెంచింది. గత ఏడాది (2021–22) ఖరీఫ్‌లో మాత్రం 3,03,653 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే రైతులు విక్రయించారు. గత ఏడాది జిల్లాల పునర్విభజన తర్వాత ఈ ఏడాది (2022–23) ఖరీఫ్‌లో వరి పంటలో అనూహ్యమైన దిగుబడులు వచ్చాయి. ఒక్క విజయనగరం జిల్లాలోనే 4.46 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అయితే, 5 లక్షల మెట్రిక్ టన్నుల వరకూ దిగుబడి వచ్చినట్టు అనధికార అంచనా. తొలుత 3.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలనేది లక్ష్యం. దానిలో ఇప్పటికే 3.10 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు పూర్తయ్యింది. చేరాల్సిన లక్ష్యంతో పనిలేకుండా రైతుల వద్ద అమ్మకానికి ఉన్న ప్రతి గింజనూ కొనుగోలు చేయాలని ప్రభుత్వం నుంచి జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు వచ్చాయి. మరోవైపు విజయనగరం జిల్లా నుంచి వేరుగా పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గంతో కలిపి ఏర్పడిన పార్వతీపురం మన్యం జిల్లాలో వరి ఈ ఖరీఫ్‌లో 1.77 లక్షల ఎకరాల విస్తీర్ణంలో సాగు అయ్యింది. దీనిలో 3,18,734 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అయ్యిందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. దీనిలో 1.91 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యం కాగా దీన్ని ఎప్పుడో జిల్లా యంత్రాంగం అధిగమించింది.



రైతు కళ్లాం నుంచే మిల్లుకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యం

మద్దతు ధర పెరిగిందిలా (మెట్రిక్ టన్నుకు రూ.ల్లో)...

సీజన్	గ్రేడ్–ఎ రకం	కామన్ రకం
2019-20	18,350	18,150
2020-21	18,880	18,680
2021-22	19,600	19,400
2022-23	20,600	20,400

సర్కారు వైపే చూపు...

ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ద్వారా పోషకాలున్న ఫోర్టిఫైడ్ రైస్‌ను ఉమ్మడి విజయనగరం జిల్లాలో తెలుపుకార్డుదారులకు అందిస్తోంది. ఈ లబ్ధిదారుల్లో అధిక శాతం చిన్న, సన్నకారు రైతులే. ఈ నేపథ్యంలో వారంతా తాము పండించిన ధాన్యం అంతా విక్రయించాలనే ఆలోచనలో ఉన్నారు. ప్రైవేట్ వ్యాపారులు, దళారులు చెబుతున్న ధర కన్నా ప్రభుత్వం చెల్లిస్తున్న ధర ఎక్కువగా ఉంది. వైఎస్సార్ రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయడం, ఈ ప్రక్రియ పర్యవేక్షణకు ధాన్యం సహాయక ఏజెన్సీలను ఏర్పాటుచేయడం, స్వల్ప వ్యవధిలోనే డబ్బులు రైతుల ఖాతాల్లోకి నేరుగా జమ చేయడం, రైస్ మిల్లర్ల ప్రమేయాన్ని నియంత్రించేందుకు తొలిసారిగా క్లస్టర్ల వ్యవస్థను ప్రవేశపెట్టడం తదితర కారణాలతో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా సాగుతోంది. ఈ నేపథ్యంలో ప్రైవేట్ వ్యాపారులు, దళారుల కన్నా ప్రభుత్వం వైపు రైతులు మొగ్గు చూపిస్తున్నారు.

రైతుల వద్ద ధాన్యంపై లెక్క...



రైతుల వద్ద ఇంకా ఎంత మేర ధాన్యం ఉన్నదీ ప్రత్యేక యాప్ ద్వారా లెక్కతీయించాం. జియో ట్యాగ్ కూడా చేశాం. ఇంకా విజయనగరం జిల్లాలో రైతుల వద్ద 45 నుంచి 50 మెట్రిక్ టన్నుల వరకూ ఉన్నట్లు తేలింది. తహసీల్దార్, ఎంపీడీఓ, మండల వ్యవసాయాధికారితో ప్రతి మండలంలోనూ కమిటీలు వేశాం. వారు ఆర్‌బీకేల వారీగా ప్రతివారం సమీక్షిస్తున్నారు. కొనుగోలులో చిన్న, సన్నకారు రైతులకు ప్రాధాన్యమివ్వాలని ఆదేశించాం. ఇప్పటివరకు జిల్లాలో రూ.617 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేశాం. రూ.446 కోట్ల మేర రైతులకు చెల్లింపులు పూర్తయ్యాయి.

– మయూర్ అశోక్, జాయింట్ కలెక్టర్, విజయనగరం జిల్లా

మరింతమంది రైతులకు లబ్ధి

సర్కారుకు ధాన్యం విక్రయం ద్వారా లబ్ధి పొందుతున్న రైతులు సంఖ్య ఏటా పెరుగుతోంది. 2019–20 ఖరీఫ్‌లో 44,183 మంది, 2020–21 ఖరీఫ్‌లో 58,386 మంది, 2021–22 ఖరీఫ్‌లో 60,915 మంది లబ్ధి పొందారు. జిల్లాల విభజన తర్వాత 2022–23 ఖరీఫ్‌లో ఒక్క విజయనగరం జిల్లాలోనే లబ్ధి పొందిన రైతుల సంఖ్య 79,500 మందికి చేరింది. పార్వతీపురం మన్యం జిల్లాలో 41,178 మంది రైతులు ఇప్పటివరకూ లబ్ధి పొందారు. ఈ ప్రకారం రెండు జిల్లాల్లో కలిపి 1,20,678 మంది రైతులు ధాన్యానికి మద్దతు ధర అందుకున్నారు. లబ్ధిదారుల సంఖ్య నాలుగేళ్లలో మూడు రెట్లు పెరగడం విశేషం.

రైతుల వద్ద ధాన్యమంతా కొనుగోలు...



ఈ ఏడాది వరి పంట దిగుబడి ఎకరానికి సగటున 5 బస్తాల వరకూ పెరిగింది. పార్వతీపురం మన్యం జిల్లాలో ఇప్పటికే కొనుగోలు లక్ష్యం చేరింది. అయినప్పటికీ రైతులు ఆందోళన చెందవద్దు. ధాన్యమంతా కొనుగోలు చేస్తాం. ఇప్పటివరకూ రైతులకు రూ.305.25 కోట్ల చెల్లింపులు పూర్తిచేశాం.

– దేవుళ్ల నాయక్, పౌరసరఫరాల సంస్థ, పార్వతీపురం మన్యం జిల్లా మేనేజర్

ధాన్యానికి మద్దతు ధర



వరి పంట సాగులో రైతు పడిన కష్టాన్ని ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి గుర్తించారు. అందుకే ఏ ఒక్కరికీ ఇబ్బంది లేకుండా మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయిస్తున్నారు. నేను అమ్మిన ధాన్యానికి పది రోజుల్లోనే నా బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ య్యాయి. గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా రైతులకు మేలు జరుగుతోంది. రైతు సంక్షేమంలో మన రాష్ట్రం దేశంలోనే ఆదర్శంగా నిలుస్తోంది.

– గుల్లిపల్లి అప్పారావు, రైతు, రామభద్రపురం

ప్రభుత్వంపై రైతులకు నమ్మకం...



ధాన్యానికి మద్దతు ధరతో పాటు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చెప్పినట్టుగానే రవాణాకు సంబంధించి ట్రాక్టర్ అద్దె, ధ్యానం ఎత్తడానికి కూలి ఖర్చులు కూడా చెల్లిస్తున్నారు. ఒక్క రూపాయి కూడా తేడా లేకుండా బ్యాంకు ఖాతాలో నగదు జమ అవుతోంది. రైతులకు ఈ ప్రభుత్వంపై నమ్మకం ఉంది. అందుకే ఆర్‌బీకేల్లో ధాన్యం విక్రయించేందుకు రైతులు మొగ్గు చూపిస్తున్నారు.

– నెట్టి ముకుంద, రైతు, బిల్లలవలస, బొండపల్లి మండలం

దళారుల మాటే వినిపించట్లేదు...



గతంలో దళారులు చెప్పిందే ధర. విధిలేని పరిస్థితుల్లో వారికే ఇచ్చేవాళ్లం. ఇప్పుడు ప్రభుత్వ విధానంతో ఆ దళారుల మాటే ఎక్కడా వినిపించట్లేదు. అధికారులే అంతా చూస్తున్నారు. నేను ధాన్యం విక్రయించిన పది రోజుల్లోనే నా ఖాతాలో నగదు జమ అయ్యింది.

– నదుపూరు అప్పలనాయుడు, రైతు, ఆనందపురం, గుర్ల మండలం

అన్నం పెట్టిన ఆట

- క్రీడా కోటాలో ప్రభుత్వ కొలువు సాధించిన అనిత
- జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పతకాల సాధన
- గుర్ల మండలం మన్యపురిపేట సెక్రటరీగా బాధ్యతల స్వీకరణ



పంచాయతీ కార్యదర్శిగా జెడ్పీ చైర్మన్ చేతుల మీదుగా నియామకపత్రం అందుకుంటున్న అనిత (ఫైల్)

విజయనగరం: నిరుపేద కుటుంబం.. తిండికే కటకటలాడాల్సిన పరిస్థితిలో ఆ చిన్నారి ఆటలపై మక్కువ పెంచుకుంది. తైక్వాండోలో కఠోర సాధన చేసి పట్టుసాధించింది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాల పంట పండించింది. ఇప్పుడు క్రీడా కోటాలో పంచాయతీ సెక్రటరీగా ప్రభుత్వ కొలువు సాధించి.. ఆటే.. తనకు అన్నం పెట్టిందంటూ సగౌరవంగా చెబుతోంది.. విజయనగరం శాంతినగర్‌కు చెందిన కాకి అనిత. ఆమె విజయగాథను ఓ సారి తరచిచూస్తే...

కాకి అనిత స్వస్థలం విజయనగరంలోని శాంతి నగర్. తండ్రి సన్యాసిరావు లారీ డ్రైవర్‌గా పని చేస్తుండగా.. తల్లి సత్యవతి దినసరి కూలి(ఇటీవల మరణించింది.) కుటుంబంలో అనితకు ఐదుగురు తోబుట్టువులు ఉన్నారు. 6వ తరగతి చదువుతున్న సమయంలో విజయనగరం బీపీఎం పాఠశాలలో తైక్వాండో శిక్షణ ఇచ్చే కోచ్‌లు సీహెచ్ వేణుగోపాలరావు, బాలాజీ వద్ద చేరింది. ఎన్నో కష్టాలను ఎదురీదుతూ క్రమక్రమంగా ఆటలో రాటుదేలింది. 2009 సంవత్సరంలో తొలిసారిగా రాష్ట్ర స్థాయి పోటీల్లో తలపడింది. ఇప్పటివరకు రాష్ట్ర స్థాయిలో 18 బంగారు పతకాలు కైవసం చేసుకుంది. 14 సార్లు జాతీయ స్థాయి పోటీలకు ఏపీ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించింది. సీనియర్స్, ఫైకా, సౌత్ జోన్ జాతీయ స్థాయి పోటీల్లో మూడు కాంస్య పతకాలు చేజిక్కించుకుంది. ఆడపిల్లలకు ఆటలెందుకని చుట్టుపక్కల వారు సూటిపోటి మాటలు చెప్పినా తైక్వాండో క్రీడలో రాణించేందుకు ప్రోత్సహించిన తన తల్లి ఉద్యోగం సాధించిన సమయంలో సజీవంగా లేదంటూ కన్నీటిపర్యంతమైంది.



తైక్వాండో క్రీడలో సాధించిన పతకాలతో అనిత

చదువులోనూ మేటి..

అనిత క్రీడలతో పాటు చదువులోనూ మేటిగా నిలిచింది. క్రీడల కోటాలో ఆంధ్రాయూనివర్సిటీ తరఫున ఎంబీఏ పూర్తిచేసింది. ఇప్పుడు తైక్వాండో క్రీడాంశంలో రిఫరీ స్థాయికి ఎదిగింది. ఇటీవలే జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చేతుల మీదుగా పంచాయతీ సెక్రటరీగా నియామకపత్రం అందుకుని గుర్ల మండలం మన్యపురిపేట పంచాయతీ కార్యదర్శిగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించానని, ఒలింపిక్స్‌లో పతకం సాధించడమే లక్ష్యంగా సాధన చేస్తున్నట్టు వివరించింది.

తృణధాన్యాలతో ఆరోగ్యకర పొడి

- అంతర్జాతీయ పోస్టర్ ప్రజెంటేషన్‌కు కంచరాం పాఠశాల ప్రాజెక్టు
- ఢిల్లీలో ఈ నెల 14, 15 తేదీల్లో ప్రదర్శన



పండూరు వేణుగోపాల్

రాజాం సిటీ: అంతర్జాతీయ పోస్టర్ ప్రజెంటేషన్‌కు 'ఇంటివద్ద తయారుచేయగల తృణధాన్యాల పొడి' అనే ప్రాజెక్టు ఎంపికైనట్టు కంచరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు పండూరు వేణుగోపాల్ తెలిపారు. ఈ మేరకు శనివారం తనకు మెయిల్ వచ్చిందన్నారు. శాస్త్రీయ పారిశ్రామిక పరిశోధన పరిషత్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ రిసోర్స్ ఆధ్వర్యంలో ఈ నెల 14, 15 తేదీల్లో ఢిల్లీలో పోస్టర్ ప్రజెంటేషన్ ఇస్తానని చెప్పారు. తృణధాన్యాలతో ఆరోగ్యకర పొడిని తక్కువ ఖర్చుతో తయారు చేసుకోవచ్చన్నారు. పొడి తయారీ విధానం, వినియోగించే పద్ధతి, పొడితో చేసిన జావ ప్రతిరోజు తాగడం వల్ల కలిగే ప్రయోజనాలను పోస్టర్ ద్వారా వివరించినట్టు ఆయన పేర్కొన్నారు. పోస్టర్ ప్రజెంటేషన్‌కు ఎంపికైన వేణుగోపాల్‌ను డిప్యూటీ డీఈఓ ఎస్.తిరుపతినాయుడు, హెచ్‌ఎం ఎం.వి.సాయిశ్వరి, ఉపాధ్యాయులు అభినందించారు.

తృణధాన్యాల పొడి తయారీ ఇలా...

తృణధాన్యాల పొడి తయారుచేసేందుకు వరిగలు, కొర్రలు, రాగులు, ఊదలు, సామలు, అరికలు, ఆండు కొర్రలు, అవిశలు, గంటెలు, జొన్నలు 100 గ్రాముల చొప్పున, దనియాలు 40 గ్రాములు, జీలకర్ర 40 గ్రాములు, వాము 20 గ్రాములు చొప్పున తీసుకోవాలి. వీటన్నింటినీ వేపుకుని పొడిచేసి బాగా కలుపుకోవాలి. 25 గ్రాముల తృణధాన్యాల పొడిని, 250 మిల్లీలీటర్ల నీటిలో కొలుపుకుని బాగా ఉడికించి గోరువెచ్చగా తాగాలి. ఈ జావ రుచి కోసం తగినంత ఉప్పు తీసుకోవాలి. ఈ జావను ఒక సంవత్సరం పిల్లాడి నుంచి అన్ని వయసుల వారు తీసుకోవచ్చు.



అంతర్జాతీయ ప్రదర్శనకు ఎంపికైన తృణధాన్యాల పొడి పోస్టర్

రాజీయే రాజమార్గం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికల్యాణ చక్రవర్తి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయికల్యాణ చక్రవర్తి

విజయనగరం లీగల్: రాజీయే రాజమార్గమని, జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని, కేసులను పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికల్యాణ చక్రవర్తి కోరారు. విజయనగరం జిల్లా కోర్టు సముదాయంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో పాల్గొన్న కక్షిదారులకు పలు సూచనలు చేశారు. కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవడం వల్ల విలువైన సమయం, డబ్బుఆదా అవుతుందని, ఇరువర్గాల వారు ప్రశాంతమైన జీవనం సాగించవచ్చన్నారు. భార్యాభర్తల గొడవలు కూడా లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. 146 మోటారు ప్రమాదబీమా కేసుల్లో కక్షిదారులకు రూ.5,14,14,360 మొత్తాన్ని అందజేయడం జరుగుతుందన్నారు. గ్రామపెద్దల సమక్షంలోనూ కొన్ని కేసులను పరిష్కరించుకోవచ్చని జిల్లా అదనపు న్యాయమూర్తి కె.రాధారత్నం తెలిపారు. కార్యక్రమంలో అదనపు న్యాయమూర్తి షేక్ సికిందర్ భాషా, ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి ఎం.మీనా దేవి, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.సంజీవరావు, సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీకుమారి, న్యాయవాదులు పాల్గొన్నారు.

పరిష్కారమైన కేసులు ఇలా..

విజయనగరం	3120
పార్వతీపురం	1764
బొబ్బిలి	2827
సాలూరు	750
శృంగవరపుకోట	569
గజపతినగరం	923
చీపురుపల్లి	876
కొత్తవలస	724
కురుపాం	108
మొత్తం	11,661

క్లుప్తంగా

30 మద్యంబాటిళ్ల స్వాధీనం



పట్టుబడిన మద్యంబాటిళ్లను చూపిస్తున్న ఎస్‌ఐ రాజేష్

దత్తిరాజేరు: మండలంలోని మరడాం కూడలి వద్ద అక్రమంగా తరలిస్తున్న 30 మద్యంబాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్.భూర్జవలస ఎస్‌ఐ రాజేష్ శనివారం వెల్లడించారు. ఇదే ఘటనకు సంబంధించి, తాడేందొరవలసకు చెందిన కిలపర్తి వెంకటరావుపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరిచినట్లు ఆయన తెలిపారు.

చింతాడవలసలో అగ్నిప్రమాదం



మంటల్లో కాలిన ఇల్లు

మెంటాడ: మండలంలోని చింతాడవలస గ్రామంలో శనివారం అగ్నిప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో పున్నాన అక్కునాయుడుకు చెందిన ఓ పూరిల్లు, రెండు గడ్డివాములు పూర్తిగా దగ్ధమయ్యాయి. సిలెండర్ రెగ్యులేటర్ నుంచి గ్యాస్ లీకేజీ కావడంతో ప్రమాదం జరిగిందని, రూ.80 వేల వరకు ఆస్తినష్టం జరిగిందని గ్రామస్తులు చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

పార్వతీపురం: మండలంలోని పదమాయవలస, నారాయణపురం మధ్యలోని దనాన చెరువు మలుపు వద్ద శుక్రవారం రాత్రి ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ దుర్ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా, గాయాలపాలైన వారిలో నారాయణపురానికి చెందిన ఎన్. పండయ్య, ఎన్.శ్రీను, డి.గంగులు ఉన్నారు. స్థానికుల సహకారంతో చికిత్స నిమిత్తం బలిజిపేట ప్రభుత్వాస్పత్రికి క్షతగాత్రులను తరలించారు. మెరుగైన వైద్యసేవల కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి వారిని తరలించినట్లు ఆస్పత్రి ఔట్‌పోస్ట్ పోలీసులు పేర్కొన్నారు.

సోషల్ మీడియా మండల కన్వీనర్‌గా ఏగిరెడ్డి

పార్వతీపురం: వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా పార్వతీపురం మండల కన్వీనర్‌గా ఏగిరెడ్డి కల్యాణ్‌ను పార్టీ అధిష్టానం నియమించింది. కో–కన్వీనర్లుగా హిమరిక సురేష్, యాండ్రాపు ప్రవీణ్, సిమ్మ గౌరీశంకరరావు, దుర్గాప్రసాద్‌లను నియమిస్తున్న పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు వారిని ఎమ్మెల్యే అలజంగి జోగారావు, టిడ్కో చైర్మన్ అభినందనలు తెలిపారు. పార్టీ విజయానికి నిరంతరం కృషి చేయాలని కోరారు.

యువకుడి ఆత్మహత్య



మృతుడు గణేష్

శృంగవరపుకోట: స్థానిక పుణ్యగిరి రోడ్డులో యువకుడు భరిణికాన గణేష్ ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్.ఐ తారకేశ్వరరావు శనివారం సాయంత్రం వెల్లడించారు. వివరాలిలా ఉన్నాయి.. ఎస్.కోటకు చెందిన గణేష్ కొన్నేళ్ల క్రితం పట్టణంలోని శ్రీనివాస కాలనీకి చెందిన కామేశ్వరిని ప్రేమించి, పెళ్లిచేసుకున్నాడు. వీరికి ఓ కొడుకు, కూతురు ఉన్నారు. మద్యానికి బానిసైన గణేష్ తరచూ భార్యతో గొడవ పడేవాడు. శుక్రవారం రాత్రి భర్త గణేష్ తనను కొడుతున్నాడంటూ కామేశ్వరి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు ఫోన్ చేసింది. దీంతో పోలీసులు వారి ఇంటికి వెళ్లి, కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇదే విషయం తెలిసిన కామేశ్వరి తండ్రి ఆమెను తమ ఇంటికి తీసుకువెళ్లిపోయాడు. దీంతో గణేష్ ఇంట్లోనే ఉరి వేసుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. ఇరుగు పొరుగు వారి సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. గణేష్ మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని మృతుని కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి మృతదేహం తరలించారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 547.00
శ్రీకాకుళం	రూ. 551.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కే. 10గ్రా.)	54,930–00
బంగారం(22కే. 10గ్రా.)	50,350–00
వెండి (కిలో)	74,500–00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹105	₹180	₹ 190

ఉత్సాహం ఉరకలు..
జోరుగా పరుగులు



విజయనగరం ఎంవీజీఆర్ కళాశాల జట్టు

- ప్రారంభమైన 'సాక్షి'ప్రీమియర్ లీగ్ ప్రాంతీయ స్థాయి పోటీలు
- జూనియర్స్, సీనియర్స్ విజేతలు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత



శ్రీకాకుళం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల జట్టు

SAKSHI | SAKSHI DIGITAL MEDIA GROUP | SPL SAKSHI PREMIER LEAGUE

విశాఖ స్పోర్ట్స్: 'సాక్షి'ప్రీమియర్ లీగ్(ఎస్పీఎల్) క్రికెట్ ప్రాంతీయ స్థాయి పోటీలు శనివారం ఏయూ గోల్డెన్ జూబ్లీ మైదానంలో ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు గోదావరి ఉమ్మడి జిల్లాల స్థాయిలో జరిగిన పోటీల్లో విజేతలుగా నిలిచిన సీనియర్స్, జూనియర్స్ జట్లు ఈ టోర్నీలో పోటీపడ్డాయి. 'సాక్షి'మీడియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించేందుకు ఆదివారం సీనియర్స్ విభాగంలో ఎంవీజీఆర్ కళాశాల(విజయనగరం) జట్టుతో ప్రభుత్వ మెన్ ఆర్ట్స్ కళాశాల(శ్రీకాకుళం) జట్టు తలపడనుంది. జూనియర్స్ విభాగంలో సాయి గణపతి పాలిటెక్నిక్(గిడిజాల) జట్టుతో శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాల(పెద్దాపురం) జట్టు పోటీ పడనుంది.

ఐదు వికెట్ల తేడాతో..

సీనియర్స్ విభాగంలో జరిగిన తొలి మ్యాచ్‌లో టాస్ ఓడిన ఎన్‌ఎస్‌ఆర్‌ఐటీ కళాశాల(శొంఠ్యాం) జట్టు తొలుత బ్యాటింగ్ చేసి నిర్ణీత 10 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి75 పరుగులు చేసింది. ఓపెనర్ సునీల్ 39 పరుగులు చేశాడు. ప్రతిగా ఎంవీజీఆర్ కళాశాల జట్టు(విజయనగరం) రెండు వికెట్లు కోల్పోయి 8.1 ఓవర్లలోనే విజయలక్ష్యాన్నందుకుంది. ఓపెనర్ రవికుమార్ 38 పరుగులతో నిలిచాడు.

హోరాహోరీ పోరులో..

జూనియర్స్ తొలి మ్యాచ్‌లో సాయి గణపతి పాలిటెక్నిక్ జట్టు తొలుత బ్యాటింగ్ చేసి ఆరు వికెట్లకు 84 పరుగులు చేసింది. నూకేష్(56) ఎనిమిది ఫోర్లతో అర్ధ సెంచరీ చేశాడు. సతీష్, గౌతమ్ రెండేసి వికెట్లు తీశారు. ప్రతిగా ఆర్‌కే జూనియర్ కళాశాల(పార్వతీపురం) జట్టు ఆరు వికెట్లు కోల్పోయి 80 పరుగులే చేయగలిగింది. చిరంజీవి 33, సంజయ్ 23 పరుగులు చేశారు. తేజ, లోకేష్ చెరో వికెట్ తీశారు.

లక్ష్యసాధనలో..

జూనియర్స్ రెండో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాల(పలాస) ఐదు వికెట్లు కోల్పోయి 91 పరుగులు చేసింది. సాయికృష్ణ 45 పరుగులు చేశాడు. చరణ్‌సాయి రెండు, యశస్వి ఓ వికెట్ తీశారు. ప్రతిగా శ్రీ ప్రకాష్ కళాశాల(పెద్దాపురం) జట్టు ఏడు వికెట్లు కోల్పోయి విజయలక్ష్యాన్నందుకుంది. ఓపెనర్ సూర్య దిలీప్ 47 పరుగులు చేశాడు. వాసు, యుగంధర్ చెరో వికెట్ తీశారు.

అర్ధసెంచరీ తేడాతో..

సీనియర్స్ విభాగం రెండో మ్యాచ్‌లో టాస్ ఓడిన ప్రభుత్వ మెన్ ఆర్ట్స్ కళాశాల(శ్రీకాకుళం) జట్టు నాలుగు వికెట్లకు 121 పరుగులు చేసింది. సాయి యశ్వంత్(60) ఏడు ఫోర్లు, మూడు సిక్సర్లతో అర్ధ సెంచరీ చేయగా షరోన్ 45 పరుగులు చేశాడు. రవికుమార్, వంశీ చెరో వికెట్ తీశారు. ప్రతిగా ఐడియల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్(కాకినాడ) జట్టు మూడు వికెట్లు కోల్పోయి 70 పరుగులే చేసి టోర్నీ నుంచి నిష్క్రమించింది. సూర్య చైతన్య 41 పరుగులు చేశాడు. యశ్వంత్ రెండు వికెట్లు తీశాడు.

ప్రభుత్వంపై తప్పుడు కథనాలు తగవు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం: రాష్ట్ర ప్రజానీకానికి నిత్యం మంచి చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, నేతలపై ప్రధాన ప్రతిపక్షం టీడీపీ నేతలు ఆరోపణలు చేయడం, ఎల్లోమీడియాలో తప్పుడు కథనాలు ప్రచురితమవుతుండడంపై ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య మండిపడ్డారు. శనివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంపై కానీ, తనపై కానీ లేనిపోని ఆరోపణలు చేసి, ఉనికిని చాటుకోవాలనుకునే ప్రయత్నం తగదన్నారు. గజపతినగరం నియోజకవర్గంలో తాగునీటి సమస్య లేకుండా ఇంటింటికీ మంచినీటి కుళాయిలను ఏర్పాటు చేస్తే దానిద్వారా తాను లబ్ధి పొందినట్లు టీడీపీ మాజీ ఎమ్మెల్యే కె.ఎ.నాయుడు మాట్లాడడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి ప్రజాసంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్నానని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జలజీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతీ గ్రామంలోని ప్రతీ ఇంటికి కుళాయిల ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందివ్వాలన్న ఆలోచన చేశానన్నారు. అయితే అప్పట్లో మొదటి విడతగా కొన్ని గ్రామాలకు మాత్రమే పైపులైన్లు వేయాలని ఆదేశాలు జారీ అయ్యాయని, కుళాయిలు ఉండి, వాటర్ ట్యాంకులు లేకపోతే ఎలా అన్న విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకువెళ్లానని తెలిపారు. దీంతో నియోజకవర్గానికి మొత్తం రూ.86 కోట్ల నిధులు మంజూరయ్యాయని, వీటితో ఎస్టిమేట్లు, టెండర్లు కూడా వేశామన్న సంగతిని మాజీ ఎమ్మెల్యే కె.ఎ. నాయుడు తెలుసుకోవాలని హితవు పలికారు. కుళాయిలు వేశారు కానీ ట్యాంకులు మరిచిపోయారని అవగాహన రాహిత్యంతో మాట్లాడడం రాజకీయ నాయకుడి లక్షణం కాదని, ఏదైనా విషయం గురించి మాట్లాడేటప్పుడు దాని పూర్వపరాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో దాదాపు 98 శాతం హామీలు నెరవేర్చారని పేర్కొన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ఆయనపై, ప్రభుత్వంపై, పార్టీ నాయకులపై కొన్ని పత్రికలు(సాక్షి తప్ప), టీవీ చానళ్లు పనిగట్టుకుని మరీ ప్రతిపక్ష టీడీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని ఇది సరికాదన్నారు. ఎలక్షన్ డ్యూటీలను సచివాలయ ఉద్యోగులకు అప్పగిస్తున్నారన్న కొన్ని పత్రికల్లో వార్తలు వచ్చాయని, వారు మాత్రం ప్రభుత్వ ఉద్యోగులు కాదా అని ప్రశ్నించారు. ఇదివరకు ఎలక్షన్ డ్యూటీ చేసిన ఉపాధ్యాయులు కూడా ప్రభుత్వ ఉద్యోగులే కదా అన్నారు. ఎవరెన్ని యాత్రలు చేసినా, ఎంతమంది ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలతో బురదజల్లే ప్రయత్నం చేసినా ప్రజలు నమ్మరన్నారు. జనమంతా సీఎం జగనన్న వైపే ఉన్నారని, 2024 ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీదే గెలుపు అని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేత నారాయణ మూర్తి రాజు, జెడ్పీటీసీ జి.తవుడు, పార్టీ మండల అధ్యక్షుడు బి.వెంకటరావు, జేసీఎస్ మండల కన్వీనర్ కె.సుబ్రహ్మణ్యం, తుమికాపల్లి సర్పంచ్ బి.త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని మృతిపై దర్యాప్తు చేయాలి



యోగేశ్వరి(ఫైల్)

మక్కువ: విద్యార్థిని కొండగొర్రె యోగేశ్వరి(16) మృతికి గల కారణాలపై దర్యాప్తు నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి వరుణ్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సాలూరు మండలంలోని తీనుసామంతవలస గ్రామానికి చెందిన యోగేశ్వరి అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందిందని, అయితే ఆమె మరణంపై పలు అనుమానాలు ఉన్నాయన్నారు. మక్కువ కేజీబీవీలో ఇంటర్మీడియట్ ఫస్టియర్ చదువుతున్న ఆమె, సంక్రాంతి సెలవుల నిమిత్తం ఇంటికి వచ్చిందన్నారు. ఆ తర్వాత అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెను తల్లిదండ్రులు ఆస్పత్రిలో చేర్చారని పేర్కొన్నారు. విద్యార్థిని ఆరోగ్యంపై కళాశాల సిబ్బంది నిర్లక్ష్యం వహించి ఉంటారని, ఈ విషయంపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి, చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్, ఐటీడీఏ పీఓ స్పందించి, బాధిత కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థిని విషయమై కేజీబీవీ ప్రత్యేకాధికారి దుర్గను వివరణ కోరగా, సంక్రాంతి సెలవులకు ఇంటికి వెళ్లి, యోగేశ్వరి తిరిగి పాఠశాలకు రాలేదన్నారు. ఆమె తల్లిదండ్రులకు ఫోన్ చేసి, అడిగితే గొంతు నొప్పితో బాధపడుతోందని, ఆస్పత్రిలో జాయిన్ చేసినట్లు తెలిసిందన్నారు. యోగేశ్వరి మృతి చెందిందన్న విషయం తెలిసిన తర్వాత బాధపడ్డామని వివరించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

దత్తిరాజేరు: రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన దుర్ఘటన మండలంలోని పెదమానాపురం రైల్వే గేటు సమీపంలో శనివారం జరిగింది. పట్టాలు దాటుతుండగా విశాఖపట్నం నుంచి రాయగడ వైపు వెళ్తున్న రైలు ఢీకొనడంతో ఈ ఘటన జరిగినట్లు సమాచారం. మృతుడు ఎవరన్నది ఇంకా తెలియరాలేదని, దాదాపు 60 ఏళ్ల వయసుండి, తెల్లపంచె కట్టుకున్నారని విజయనగరం రైల్వే ఎస్‌ఐ రవివర్మ తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు ఫోన్ నంబర్లు 9490617089, 9440591331 ను సంప్రదించాలని కోరారు.



రైలుపట్టాల వద్ద ఉన్న మృతదేహం పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

లారీ ఢీకొని..

జామి: లారీ ఢీకొని రైతు బండారు ప్రసాదరావు(49) మృతి చెందిన విషాద ఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. లక్ష్మీపురం గ్రామానికి చెందిన ప్రసాదరావు ఎప్పటిలాగే గడ్డి మోపుతో కల్లానికి వస్తుండగా, ఎస్.కోట నుంచి జామి వైపు వస్తున్న లారీ బలంగా ఢీకొట్టింది. దీంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. అప్రమత్తమైన స్థానికులు వైద్యసేవల నిమిత్తం 108 అంబులెన్స్‌లో విజయనగరం ప్రభుత్వాస్పత్రికి అతడిని తరలించగా, మార్గమధ్యంలోనే ప్రాణాలు విడిచాడు. మృతుడికి భార్య అచ్చియ్యమ్మ, కొడుకు శ్రీనివాసరావు, కూతురు ఉషారాణి ఉన్నారు.



మృతి చెందిన ప్రసాదరావు

రాష్ట్ర స్థాయి నాటిక పోటీలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలనతో నాటిక పోటీలు ప్రారంభిస్తున్న నగర డిప్యూటీ మేయర్ శ్రావణి

- ముఖ్య అతిథిగా నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి హాజరు



చీకటి పువ్వు నాటికలో ఓ సన్నివేశం

విజయనగరం టౌన్: స్థానిక గురజాడ కళాభారతి ఆవరణలో 7వ రాష్ట్ర స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నాటక శాల, అభినయ సంస్థల సంయుక్త నిర్వహణలో నటరత్న నాటక పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి విచ్చేసి, జ్యోతి ప్రజ్వలనతో నాటిక పోటీలను ఆరంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సమాజంలో జరిగే వాస్తవిక సంఘటనలను కళ్లకు కట్టినట్లు చూపించేవి నాటికలని, ప్రజలను చైతన్యం చేయడంలో ఇవి ప్రధాన పాత్ర పోషిస్తాయన్నారు. కళలకు పుట్టినిల్లు అయిన విజయనగరంలో నాటకాన్ని బతికించడానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. మన సనాతన సంప్రదాయాలు, విలువలను నేటితరానికి చెప్పాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న ఈ తరుణంలో నాటక నిర్వాహకులు కూడా టెక్నాలజీని ఉపయోగిస్తే బాగుంటుందన్నారు. అనుభవం కలిగిన కళాకారులు నేటితరానికి నాటకం పట్ల శిక్షణ ఇస్తే మంచిదన్నారు. అనంతరం ఆమె నాటక పరిషత్ నిర్వహించిన నాటిక పోటీలకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి తరఫున రూ.10 వేలను విరాళంగా అందజేశారు. అనంతరం నిర్వాహకులు ఆమెను ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ చైతన్య కళాభారతి ఆధ్వర్యంలో మంచాల రమేష్ దర్శకత్వంలో నిర్వహించిన 'చీకటి పువ్వు' నాటిక ప్రేక్షకులను ఆద్యంతం అలరించింది. విజయనగరానికి చెందిన నాటక శాల, నటసేవా సమాజం ఆధ్వర్యంలో గెద్ద వరప్రసాద్ దర్శకత్వం వహించిన మహర్షి నాటిక ప్రదర్శన కూడా చూపరులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో సాగి శివసీతారామరాజు కళాపీఠం అధ్యక్షులు నాలుగెస్సుల రాజు, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, వ్యాపారవేత్త అబ్బులు, కళాపీఠం నిర్వాహకులు అభినయ శ్రీనివాస్, గెద్ద వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యావలంటీర్లను కొనసాగించాలి



డిప్యూటీ సీఎం రాజన్న దొరకు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘ నాయకులు, విద్యావలంటీర్లు

సాలూరు: ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న ఆదివాసీ మాతృభాషా విద్యావలంటీర్లను కొనసాగించాలని ఆదివాసీ, విద్యావలంటీర్ల సంఘ నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదే విషయమై వారంతా డిప్యూటీ సీఎం, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్న దొరను పట్టణంలోని ఆయన స్వగృహంలో శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. విద్యావలంటీర్లను కొనసాగించడం ద్వారా గిరిజన విద్యార్థులకు కలిగే ప్రయోజనాలను మంత్రికి వివరించారు. అలాగే జాతీయ సర్వశిక్ష అభియాన్ నుంచి మంజూరైన కెపాసిటీ ఆఫ్ బిల్డింగ్ నిధులను బోధనకు ఉపయోగించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ



మాట్లాడుతున్న సూర్యనారాయణ

విజయనగరం పూల్‌బాగ్: ఏప్రిల్ 5వ తేదీన చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ, ఏపీ(ఆంధ్రప్రదేశ్) రైతు, కౌలు రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఇదే విషయమై స్థానిక కె.ఎల్.పురంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాసంపదను కార్పొరేట్ వ్యవస్థలు, పెట్టుబడిదారులు దోచుకుంటున్నారని విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా ప్రజావ్యతిరేక విధానాలు తీసుకువస్తున్నారని, దేశ ప్రజలపై పన్నుల భారం మోపారని, రైతు శ్రేయస్సు మరిచారని దుయ్యబట్టారు. కార్మికులకు నెలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రైతులకు మద్దతు ధరల గ్యారంటీ చట్టం తీసుకురావాలని, సమగ్ర రుణమాఫీ అమలు చేయాలని, వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ కూలి రోజుకు రూ.600 ఇవ్వాలని, కౌలు రైతులకు సమగ్ర చట్టం తేవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు, జిల్లా కార్యదర్శి సురేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జి. అప్పారావు, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.రాములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ నాయుడు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.గోపాలం, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీల్లో తెర్లాం క్రీడాకారుల సత్తా



ట్రోఫీ, మెడల్స్‌తో క్రీడాకారులు శివ, దుర్గాప్రసాద్

తెర్లాం: ఒడిశా రాష్ట్రంలోని పూరీ నగరంలో ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు జరిగిన 44వ సీనియర్ జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో విజయనగరం జిల్లాలోని తెర్లాం మండలానికి చెందిన ఇద్దరు క్రీడాకారులు తమ సత్తాచాటారు. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు సభ్యులుగా పాల్గొని, జాతీయ స్థాయిలో జట్టు ప్రథమ స్థానంలో నిలిచేందుకు పెరుమాళి గ్రామానికి చెందిన పి.శివ, కుమ్మరిపేట గ్రామానికి చెందిన ఎం.దుర్గాప్రసాద్ మంచి ఆటతీరుతో అందరినీ ఆకట్టుకున్నారు. ఫలితంగా గోల్డ్‌మెడల్, ప్రశంసాపత్రాన్ని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శుల చేతుల మీదుగా అందుకుని, జిల్లా ఖ్యాతిని నలుమూలకు చాటారు.